# కాలం వేగానికి కళ్ళెం ?

## కొట్టి రామారావు



క్రేన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ

మా ఊళ్లో ఒక గొప్ప సాహిత్య సంస్థ వివిధ సాహిత్య ప్రక్రియలలో కవులకు ఏటా నగదు పురస్కారా లిస్తున్నది. ఈ పురస్కార నిర్ణయంలో భాగంగా వచన కవితా ప్రక్రియ పురస్కారానికి నేను న్యాయ నిర్ణేతగా వ్యవహరించడం జరిగింది. ఈ పురస్కారాన్ని ఆశిస్తూ అనేక మంది కవులు, కవయిత్రులూ తమ తమ కవితా సంకలనాలను పంపించారు. ఈ కవులు కొందరు ప్రారంభదశలో ఉన్నవారుండగా కొందరు పేరు పొందిన గొప్పకవులూ ఉన్నారు. ఈ పురస్కారానికి పంపిన సంకలనాలలో ఎక్కువ భాగం వచన కవితలే. అయితే మరికొన్ని వచన కవితల్లోని ఆధునిక ధోరణులు-మినీ కవితలు, హైకూలు, నానీలు, కొద్దిగా పేరడీలు కూడ ఉన్నాయి. న్యాయనిర్ణేతగా ఈ సంకలనాలన్నీ చదివాను. పరిశీలన పూర్తయ్యాక నా నిర్ణయాన్ని సాహిత్య సంస్థ కార్యవర్గానికి పంపేను....

ఈ రూపంగా నేను చాలా మంచి కవితలను చదివే అవకాశం కలిగింది. కొన్ని సంకలనాలకు 'ముందుమాట'లు వ్రాసిన ప్రముఖులైన విమర్శకులు చక్కటి విశ్లేషణ చేశారు., ఇదంతా నా రచన కెంతో ఉపకరించింది. అంతవరకు కేవలం వచన కవితలే వ్రాస్తున్న నాకు- ఈ అనుభవంతో నూతన ప్రక్రియలు-మినీ కవితలు, హైకూలు, నానీలు, పేరడీలు కూడ తెలిశాయి. వాటి లక్షణాలు, నియమనిబంధనలు చాల ఆసక్తిని కలిగించేయి. 'ఈ ప్రక్రియల్లో నేను కూడ ఎందుకు రాయ కూడదు'? అనిపించింది. దాని ఫలితమే వచన, మినీ కవితలు, హైకూ, నానీ, పేరడీల సమాహారం- నా కవితా సంకలనం "కాలం వేగానికి కళ్లెంవేద్దాం"! ఈ సంకలనాన్ని టౌన్ హాల్లో ఒక ప్రముఖ కవి ఆవిష్కరించేరు. నాకు స్ఫూర్తి నిచ్చిన కవికి దీనిని అంకితమిచ్చేను. ఆవిష్కరణ అయిన వెంటనే ప్రముఖ పత్రికలన్నింటికి రెండేసి కాపీలను "గ్రంథ సమీక్ష" కోసం పంపేను. కొన్ని పత్రికలు సమీక్షించేయి. కొన్ని పత్రికలు ఈ సంకలనాన్ని తమ "స్వీకారం" శీర్షికలో ప్రచురించేయి. అది చూసే జైల్లోని సింహాచలం రాసిన ఉత్తరం!

"శ్రీమతి రాధాదేవి గారికి-నమస్తే!

"నా పేరు సింహాచలం. హత్యానేరారోపణపై ఈ సెంట్రల్ జైల్లో ఉన్నాను. దిన పత్రికలు ఖైదీలు చదువుకునే ఏర్పాటు చేశారు. మాలో కొందరు ఇక్కడ నుంచి ప్రైవేటుగా డిగ్రీకి కూడా వెళ్తున్నారు. పత్రికలు చదువుతుంటే ఒక దిన పత్రిక ఆదివారం అనుబంధంలో "స్వీకారం" శీర్షికలో మీ కవితా సంకలనం "కాలం వేగానికి కళ్లెం వేద్దాం" చూశాను. క్రింద కవయిత్రిగా మీ పేరు, ఎడ్రసు, సంకలనం ఖరీదు రాశారు. మీ సంకలనం టైటిల్ చాలా ఆసక్తి కలిగించింది. టైటిలే ఇంత ఆసక్తిని కలిగిస్తే అందులోని కవితలు మరెంత ఇంటరెస్టింగ్‌గా ఉంటాయో! "కాలం వేగానికి కళ్లెంవెయ్యడం" సాధ్యమా? అయితే ఎట్లా? మీ నుండి తెలుసుకోవాలనుకుంటున్నాను. ఈ వివరాలు మీ పుస్తకంలో ఉన్నాయా? దయచేసి మీ కవితా సంకలనం ఒక కాపీని నేనిచ్చిన ఎడ్రసుకు పంపవలసిందిగా కోరుతున్నాను. దాని ఖరీదు పంపే ప్రయత్నం చేస్తాను......."

అభివాదాలతో, భవదీయుడు.....

ఈ ఉత్తరం నన్నెంతో ఆశ్చర్యంలో ముంచెత్తింది. నేను ఈ మధ్యనే కథలూ, కవితలూ వ్రాస్తున్న రచయిత్రిని. కొన్ని రచనలు పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. ఈ ప్రచురింపబడిన వాటికి, నాదగ్గరున్న వాటినీ కలిపి" "కాలం వేగానికి కళ్లెం వేద్దాం" అనే శీర్షికతో ఒక కవితా సంకలనం ప్రచురించేను.

ఈ ఉత్తరం నాకెంతో ఆశ్చర్యం కలిగించింది. కించిత్తు గర్వం కూడా....! సింహాచలం ఉత్తరాన్ని మావారికి చూపించాను. ఆయన

పేరు పొందిన క్రిమినల్ లాయరు, సత్యమూర్తిగారు. సాహిత్య ప్రియులు, నా రచనా వ్యాసంగాన్ని ఎంతో ప్రోత్సహించే సహృదయులు.

"ఈ ఉత్తరం నిజమైనదే అంటారా?"

ఉత్తరం ఆయనకిచ్చేను.

సత్యమూర్తి అటూ ఇటూ తిప్పి "నిజమైనదే. ఇందులో ఖైదీ నెంబరుంది. CENSORED అనే ముద్రా ఉంది" అన్నారు అప్పటి వరకూ ఆ ముద్రే నేను చూళ్లేదు.

"పుస్తకం పంపవచ్చా?" అడిగేను. ఆయన కొంచెం ఆలోచించి "తప్పేముంది? పంపు" అన్నారు.,

పంపి, విడిగా ఒక ఉత్తరం రాశాను.

"శ్రీ సింహాచలం గారికి, మీ ఉత్తరంలో కోరినట్లుగానే నా కవితా సంకలనం "కాలం వేగానికి కళ్లెం వేద్దాం" బుక్ పోస్టులో పంపేను. దాని ఖరీదు మీరు పంపించనక్కరలేదు. శిక్ష అనుభవిస్తూ కూడ సాహిత్యం మీద మీరు చూపిస్తున్న అభిమానానికి అభినందనలు. ఒక సంగతి. మీపై ఆరోపించబడిన నేరానికి "ఇన్ని సంవత్సరాలు" అని మీరు శిక్ష అనుభవిస్తుంటే "కాలం వేగానికి కళ్లెం వేసే" ప్రయత్నం చేయకూడదు. కాలాన్ని మరింత వేగంగా పయనింపజేసే ప్రయత్నం చెయ్యాలి" - ఇట్లు......రాధాదేవి.

☆ ☆ ☆

కొన్నివారాలు గడిచేయి. ఆ సింహాచలం గురించి ఆలోచనలు నన్ను వదిలిపెట్టలేదు. సాహిత్యప్రియులు,కవులు, కళాకారులు- ఎక్కువమంది-మానవత్వపు విలువలకు కట్టుబడి ఉంటారని- నేననుకుంటాను. అటువంటప్పుడు సాహిత్యాభిలాష గల ఈ సింహాచలం నిజంగా హత్యచేశాడా? ఈ విషయం మా వారితో చర్చించేను...

"ఫలానా వాళ్లే హత్యలు చేస్తారని ఎక్కడాలేదోయ్! ప్రత్యేక విషమ ఘడియల్లో మూమెంటరీగా ఇటువంటి ఘోరాలు జరిగి పోతుంటయ్"! ఆయన సమాధానం నన్ను సంతృప్తి పరచలేదు.

"అయితే ఏం చేద్దాం? అతన్ని కలసి నువ్వెందుకు హత్య చేశావని అడుగుతావా?"

"అవునండీ! అతన్ని కలుద్దాం. అతని గతం గురించి తెలుసుకుందాం!"

"ఒహో! ఈ రూపంగా మేడమ్ గారికి ఒక "కథ ప్లాట్" దొరుకుద్దనా?" నవ్వేరు!

"అది కాదండీ, మీరు గొప్ప క్రిమినల్ లాయరు కదా! అతను నిర్దోషి అయితే ఆ శిక్ష నుండి తప్పించవచ్చు కదా!"

"ఇదంత ఆషామాషీ వ్యవహారం కాదోయ్! ఆ అవకాశమే ఉంటే అతను జైల్లో ఎందు కుంటాడు?" పైకి సత్యమూర్తి ఇలా గన్నాడు కాని, అమాయకులు కూడా ఒకోసారి జైలు పాలవుతారని అతనికి తెలుసును!

"అలా కాదండీ, మనమో ప్రయత్నం చేద్దాం. మీరన్నట్టుగానే అతను దోషి అయితే మనం చేయగలిగేదేమీ వుండదు. కానప్పుడు మీ వాదనతో అతనిని విడిపించగల్గితే మీ ప్రతిభకు గొప్ప గుర్తింపు వస్తుంది."

"చూద్దాం"

"హమ్మయ్య మీరంగీకరిస్తే ఇక పని అయినట్లే"! సంతృప్తితో నిట్టూర్చాను

ఒక ఆదివారం సాయంకాలం సెంట్రల్ జైలుకు బయలుదేరాం. సింహాచలం రాసిన కార్డు చూపించి అతన్ని కలవడానికి పర్మిషన్ అడిగాం. మావారి ఫేస్‌వాల్యూ వలన పర్మిషన్ దొరికింది. మమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాడు. విషయం కదిపితే వెక్కి వెక్కి ఏడ్చాడు. మాకు తోచినట్లుగా ఓదార్చాం. మావారు అడిగారు "జరిగింది జరిగినట్లుగా చెప్పు. నువ్వు నిజం చెబుతున్నావో లేదో, నా అనుభవం వల్ల నాకు తెలుస్తుంది...నిజం తెలుసుకోవాలని మేడమ్ పట్టుపట్టడంతో మేం వచ్చేం......"

సింహాచలం కళ్లుతుడుచుకున్నాడు. తన కథ ప్రారంభించేడు. అతని మాటలూ హావ భావాలు చూస్తే నిజాయితీ ధ్వనించింది. ఒక గంట తర్వాత మేం తిరిగివచ్చేం.....!

☆ ☆ ☆

రాత్రి పదిగంటలు. తలుపులు దబదబా బాదుతున్నారు. "ఎవరూ?" కమల తలుపు తీసింది. పోలీసులు! లోపలికి వెళ్తే బెడ్‌రూంలో కృష్ణ! వాళ్లిద్దర్నీ అరెస్టు చేశారు. పోలీసులు తమ విధానంలో ప్రశ్నించేసరికి అసలు నిజాలు బయటపడ్డాయి.

☆ ☆ ☆

సింహాచలం ఒక సెంట్రల్ గవర్నమెంట్ సంస్థలో అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. అదొక చిన్న ఊరు. కాపురం దానికి 10 కిలోమీటర్ల దూరంలో, హెల్పర్స్, క్లాస్‌ఫోర్ తప్ప అన్ని డ్యూటీలు అతనివే. డ్యూటీ రాత్రి 6 గంటల నుండి ఉదయం 6 గంటల వరకూ. ప్రతి రాత్రీ డ్యూటీయే. పగలే ఆఫ్.

సహోద్యోగి మోహనరావుది పగలు డ్యూటీ. యిద్దరూ స్నేహంగా ఉంటూ, ఫ్యామిలీ ఫ్రెండ్‌షిప్‌నీ డెవలప్ చేసుకున్నారు. ఇళ్లకూ రాకపోకలు ఉన్నాయి. సింహాచలానికి పెళ్లయి అయిదారు సంవత్సరాలయింది. ఇంకా పిల్లలు లేరు. భార్య కమల, అందమైనది, హుషా రయింది. భర్త నైట్ డ్యూటీలు ఆమెకు నచ్చ లేదు. పగలు డ్యూటీలు వేయించుకోమని శతపోరేది. అతనేం చేస్తాడు? జూనియర్లకి నైట్ డ్యూటీలు సీనియర్లకి పగలు డ్యూటీలు- అది ఆ సంస్థ పాలసీ. నిజానికి జూనియర్లకే- ముఖ్యంగా కొత్తగా పెళ్లయిన వాళ్లకే పగలు డ్యూటీలు వెయ్యాలి! ఇది న్యాయం. కాని న్యాయం ఎవడికి కావాలి. గవర్నమెంటు రూల్సన్నీ ఇలాగే వ్యతిరేకంగా ఉంటాయి...

మోహనరావు సింహాచలం ఇంటికి వస్తూ పోతూండేవాడు, రాత్రిళ్లూ వచ్చేవాడు. "సింహా చలం" అంటూ, అతను ఉండడని తెలిసినా. వయస్సు పోరుతో రాత్రులు నిద్రపట్టని కమల.... వంటరిగా తరచుగా వచ్చి కూర్చునే మోహనరావు... ఎవరూ పని కట్టుకుని చెడ్డవాళ్ల వరేమో! బహుశా పరిస్థితులు వాళ్లనలా ప్రేరేపిస్తాయేమో!! కమలకు మోహనరావుతో పరిచయం...క్రమంగా.... అక్రమ సంబంధంగా పరిణామం చెందింది. స్నేహితుడి మీద సింహాచలానికి అనుమానం రాలేదు. "వాళ్లిద్దరూ" ఆ జాగ్రత్తలు పడ్డారనడం కరక్టేమో!

తినగా తినగా తీపి కూడ చేదవుతుంది. తీపిలో కూడ వెరైటీలు కావాలనిస్తుందేమో! ఈ మధ్య కమల మోహనరావుతో ముందంత ఇష్టం చూపించడం లేదు. ఏదో వంకపెట్టి అతని రాకను నియంత్రించడం మొదలు పెట్టింది. అతనికి ఆశ్చర్యం అనుమానంతో ఒక రోజు రాత్రి పదిగంటలకు వచ్చేడు... ఇంటిలో మగవాడి మాటలు విన్పించేయి.... "కమలా" అని పిలిచేడు. కొంచెం ఆలస్యంగా.... నలిగిన ఫుల్ మేకప్‌లో.... వచ్చింది!

"ఎవరూ?" అడిగేడు.

"మా చుట్టాలబ్బాయిలే" అని తలుపేసు కుంది. చేసేది లేక మోహనరావు వెనుతిరిగాడు.

ఈ రకంగా చాలాసార్లు జరగడంతో మోహనరావు అనుమానం బలపడింది.

"నిజంచెప్పు కమలా? ఎవరా అబ్బాయి?" గద్దించేడు!

"అవును అతను ఈ ఊరు సర్పంచ్ కృష్ణ! ఎందుకలా అరుస్తావు? నువ్వేమయినా నాకు తాళి కట్టిన భర్తవా?"

మోహనరావు అవాక్కయ్యాడు "నీకిది మంచిది కాదు. సింహాచలానికి తెలిస్తే బాగుండదు!"

అని వెళ్లిపోయాడు.

పాత పరిచయాన్ని తెంచుకోలేక మోహన రావు మరలా వచ్చేడు. ఈసారి బెదిరించేడు. సింహాచలంతో చెబుతానని కమల ఈసారి బెదిరింది. "రేపు రాత్రికి రా, మాట్లాడదాం" అని సర్ది చెప్పి పంపేసింది.

మోహనరావు వెళ్లిపోయాక కృష్ణతో ఈ విషయం చర్చించింది. మోహనరావుని రమ్మన్న టైమ్‌కి కమల ఒక్కతే ఉంది. "ఎందుకు మోహన్, గొడవ చేస్తావు? ఎవరైనా నీ, తర్వాతేలే!" ఏమీ జరగనట్లు అతనితో మరింత ప్రేమగా కోరిక తీర్చింది. మోహనరావు చాలా సంతృప్తి పడ్డాడు... ప్రథమ కలయిక గుర్తొచ్చింది.... బయలుదేరే ముందు మరోసారి కౌగలించుకొని ముద్దు పెట్టుకుని "అప్పుడే వెళ్లిపోతావా, మోహన్!" గేటు వరకు వచ్చింది. "అన్నట్టు మోహన్, ఎల్లుండి ఉదయం మా ఆయన ఊరికి వెళ్తున్నారు. సాయంకాలం వరకూ రారు. ఉదయం పది గంటల కల్లా వచ్చెయ్"

"నాకు డ్యూటీ ఉంది కదా....."

"ఎవరికైనా వప్పగించి రద్దూ..." అందమైన అమ్మాయి గోముగా ఆహ్వానిస్తుంటే కాదంటానికెన్ని గుండెలు!

"కామాతురాణాం ...... న భయం.... నలజ్జా...." అలాగేనని మోహన్ వెళ్లిపోయాడు.

రాత్రి తెల్లవార్లూ డ్యూటీ చేసి వచ్చాడు, సింహాచలం. వచ్చిన వెంటనే స్నానం చేసి టిఫిన్ తిని పడుకుంటాడు. మళ్లీ లేవడం భోజనానికే, ఒంటి గంటకు. ఈ రోజూ 8 గంటలకల్లా మంచమెక్కాడు, వెంటనే గాఢ నిద్రలోకి జారుకున్నాడు.

సింహాచలం యింటికి మెష్‌తో వరండా. వరండా తలుపు తీసుకుని ప్రవేశిస్తే హాలు. హాలుని చేర్చి బెడ్‌రూం. కమల చెప్పినట్లుగా మోహనరావు ఉదయం పది గంటలకు వచ్చేడు. కమల వరండాలో నిలబడి అతనికి స్వాగతం చెప్పింది. తలుపేసి "కాఫీ తెస్తాను లోపలికి రండి" మోహనరావు హాలు తలుపు తోసుకుని అడుగుపెట్టాడు. తలుపు వెనకాలే ఉన్న వ్యక్తి మోహనరావు తలపై బలంగా కొట్టాడు.

"చంపేశారు, బాబోయ్" అంటూనేల కూలాడు.

కొట్టిన వ్యక్తి వరండాలోకొచ్చి బయట గొళ్లెం పెట్టాడు. చావు కేకకు గాఢనిద్రలో ఉన్న సింహాచలం కంగారు పడుతూ వచ్చి మోహన రావుని చూశాడు. రక్తం మడుగులో ఉన్నాడు.

"మోహన్, ఏం జరిగింది" అంటూ గట్టిగా కుదిపాడు. మోహనరావు నెమ్మదిగా కళ్లు తెరిచాడు. బాధగా మూలుగుతూ "నీకు ద్రోహం చేసినందుకు, నాకు తగిన శాస్తి జరిగింది. సింహాచలం!'' కొనఊపిరితో కొట్టుకుంటున్నాడు.

"ద్రోహమేమిటి? ఎవరు నిన్ను కొట్టింది?"

"చెబుతాను. నేను పోయేలోగా నిజం చెబుతాను.కొంతయినా నా పాపం తగ్గుతుంది."

ఒక్కొక్కమాట కూడబలుక్కుంటూ చెప్పాడు, తనకూ కమలకూ కలిగిన అక్రమ సంబంధం తర్వాత తనని నిర్లక్ష్యం చేసి ఈ ఊరు సర్పంచి కృష్ణతో కమల సంబంధం పెట్టుకోవడం, నేనది సహించలేక నీతో చెబుతా నని బెదిరించడం, ఈరోజు నువ్వు ఊరికెళ్తున్నా వని చెప్పి నన్ను రమ్మనడం, నేను హాల్లోకి ప్రవేశించగానే కృష్ణ నన్ను బలంగా కొట్టడం... నువ్వొచ్చేలోగానే బయట గొళ్లెం పెట్టడం...

"సింహాచలం, నన్ను క్షమించు, కనీసం నీ ప్రాణమైనా కాపాడుకో, ఆ దుర్మార్గుల బారినుండి" మోహనరావు ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి.

సింహాచలం నిశ్చేష్టుడయ్యాడు. తేరుకుని "కమలాకమలా," అరిచాడు. తలుపులాగేడు. బయట గొళ్లెం పెట్టినట్టు అర్థం చేసుకుని బావురుమన్నాడు.మరో అరగంటలో పోలీసుల్ని తీసుకుని కృష్ణ వచ్చేడు. కమల వాళ్లతో జత కలిసింది.

"ఎందుకండీ, ఈ పని చేశారు" అంటూ సింహాచలం మీద పడి దొంగ ఏడుపులు మొదలెట్టింది. మోహనరావు పై హత్యా నేరం క్రింద సింహాచలాన్ని అరెస్టు చేసి కేసు పెట్టారు....

సర్పంచ్ కృష్ణ తన డబ్బూ, పలుకుబడి ఉపయోగించి, దొంగ సాక్ష్యాలు సృష్టించి సింహాచలం పై నేరం ఋజువు చేసే గట్టి ప్రయత్నంలో ఉన్నాడు. కమల కూడ సింహాచలానికి వ్యతిరేకంగా ....మోహనరావుని.... సింహాచలమే హత్య చేసినట్లు సాక్ష్యం చెప్పింది.

"ఒక్క దెబ్బకు రెండు పిట్టలు." తనని బెదిరించిన మోహనరావు అడ్డు తొలగించుకోవడం– ఆ నేరం సింహాచలం మీదకు తోసి లైన్‌క్లియర్ చేసికోవడం! కృష్ణకూ, కమలకూ ఎదురే లేకుండా పోయింది. కృష్ణ తనకున్న పలుకుబడినీ, డబ్బునీ ఉపయోగించి సంబంధిత అధికారుల్ని లోబరుచుకున్నాడు. చివరకు సింహాచలం తరపున వాదించే లాయరే లేకుండా పోయాడు. ప్రభుత్వం వారే ఒక "మామూలు లాయరు"ను ఏర్పాడు చేశారు. సింహాచలం అరెస్టయిన రెండు రోజుల్లోనే అతన్ని ఉద్యోగం నుండి సస్పెండు చేశారు.,

ఈ వివరాలన్నీ సింహాచలం స్వయంగా సత్యమూర్తికి చెప్పాడు, రెండు మూడు దఫాలుగా రాధాదేవి భర్తను అడిగింది.

"ఈ కేసుని మీరు టేకప్ చెయ్యండి, ప్లీజ్ ఒక అమాయకుడిని కాపాడి ఆ దుర్మార్గులకు శిక్ష పడేలా చేయగల సమర్థులుమీరే!" సత్యమూర్తి ఆలోచించేడు. సింహాచలం దగ్గర వకాల్తా తీసికొని కోర్టుకు తను ఎప్పియరవు తున్నట్టు తెలియపరిచాడు.

వాదోపవాదాలు కొన్ని నెలల పాటు నడిచాయి. అందరి నేరస్తులలాగే కమలా, కృష్ణలు తమకు ఏమీ తెలియదని వాదించేరు. అయినా సత్యమూర్తి ప్రతిభ ముందు అన్యాయానికి, అబద్ధానికి శిక్ష పడింది. మోహనరావు హత్యా నేరం క్రింద నేరం ఋజువవడంతో కృష్ణకు యావజ్జీవ కారాగారం, సహకరించిన కమలకు 7సం।లు కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. సింహాచలాన్ని నిర్దోషిగా భావించి విడుదల చేశారు. ప్రభుత్వమూ అతని ఉద్యోగాన్ని పునరుద్ధరించింది.

తను వ్రాసిన కవితా సంకలనం శీర్షిక ఒక అమాయకుడిని హత్యానేరం నుండి రక్షించడం, ఇద్దరు దుర్మార్గులను శిక్షించడం– తలుచుకుంటే రాధాదేవికి థ్రిల్లింగ్‌గా ఉంది. సాహిత్య సభల్లో విన్నప్పుడు అంతగా పట్టించు కోని "సాహిత్య ప్రయోజనం" నేడు నిజంగా సిద్ధించినట్లు తృప్తి పడింది. ఈ ప్రయోజనం చేకూరడానికి ప్రధాన కారకుడైన తన భర్త సత్యమూర్తి పై కృతజ్ఞతతో కూడిన ఆర్ద్రతా భావం ఇనుమడించింది.